క్లుప్తంగా

పంటల పరిశీలన



వరిపంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

జగిత్యాల అగ్రికల్చర్: జగిత్యాల రూరల్ మండలంలోని పొలాస వ్యవసాయ శాస్త్రవేత్తల బృందం గురువారం జగిత్యాల రూరల్, సారంగాపూర్ మండలాల్లో రైతులు సాగుచేసిన వరిపంటలను పరిశీలించారు. పంటలో పాముపొడ, కాండం కుళ్లు తెగులు, కాండం తొలుచు పురుగు ఎక్కువగా ఉన్నట్లు శాస్త్రవేత్తలు సూచించారు. దీని నివారణకు పిచికారీ మందులపై రైతులకు వివరించారు. శాస్త్రవేత్తలు బలరాం, స్వాతి, గోన్యనాయక్, రజినీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

రంగాపూర్‌లో గడప గడపకూ కాంగ్రెస్



ప్రచారం చేస్తున్న నాయకులు

మేడిపెల్లి : భీమారం మండలంలోని రంగాపూర్ గ్రామంలో కాంగ్రెస్ నాయకులు గడప గడపకూ కాంగ్రెస్ నిర్వహించారు. రానున్న ఎన్నికల్లో ఓటువేస్తే అమలుచేసే పథకాలపై ప్రజలకు వివరించారు. ఆరు గ్యారంటీ కార్డులను అందజేశారు. కార్యక్రమంలో నరేశ్ రెడ్డి, జంగంపల్లి విజయ్, ముంజ కిషన్‌గౌడ్, మధు, రవి, తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ

జగిత్యాల: ఆర్‌అండ్‌బీ శాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి తల్లి మంజులమ్మ గురువారం హైదరాబాద్‌లో మృతిచెందగా ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ వారి ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు. ఆమె మృతికి గల కారణాలను ఫోన్‌లో అడిగి తెలుసుకున్నారు.

ఫ్లెక్సీ, పోస్టర్ల తొలగింపు



పోస్టర్లు తొలగిస్తున్న మున్సిపల్ సిబ్బంది

రాయికల్: పట్టణంలో ఎన్నికల కోడ్ నేపథ్యంలో గురువారం మున్సిపల్ కమిషనర్ గంగుల సంతోష్‌కుమార్ ఆధ్వర్యంలో పట్టణంలోని వివిధ పార్టీల జెండాల ఫ్లెక్సీలు, పోస్టర్లను తొలగించినట్లు తెలిపారు. ఎన్నికల నియమ నిబంధనలను తప్పనిసరగా పాటించాలన్నారు.

ఓటరు నమోదుకు మరో అవకాశం

పెగడపల్లి: ఎన్నికల సంఘం ఆదేశం మేరకు ఈనెల 31 వరకు కొత్తగా ఓటరుగా నమోదు చేసుకునేందుకు అవకాశం కల్పించినట్లు తహసీల్దార్ ఎంఏ ఫారూఖ్ తెలిపారు. గురువారం తహసీల్దార్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. ఒక ప్రాంతం నుంచి బదిలీ చేసుకునేందుకు కూడా వెసులుబాటు కల్పించిందన్నారు. జాబితాలో పేరులేని వారంతా ముందుకురావాలన్నారు. దరఖాస్తులను ఆన్‌లైన్‌లో సమర్పించి ఓటరుగా నమోదు చేసుకోవచ్చన్నారు. ఇందుకు అవసరమయ్యే ఫారాలు తహసీల్దార్ కార్యాలయం, బీఎల్‌వోల వద్ద అందుబాటులో ఉన్నట్లు తహసీల్దార్ తెలిపారు.

వరి కోతలు షురూ



వరిపంట కోస్తున్న హార్వెస్టర్

పెగడపల్లి: ఖరీఫ్ సీజన్‌లో సాగుచేసిన వరికోతలు మొదలయ్యాయి. ఎస్సారెస్పీ ప్రాజెక్టు, చెరువులు, కుంటలు, వ్యవసాయబావుల ఆధారంగా ఎక్కువగా రైతులు వరిసాగుకే మొగ్గు చూపారు. మండలవ్యాప్తంగా సుమారు 25 వేల ఎకరాల్లో వరిసాగు చేసినట్లు వ్యవసాయ అధికారులు తెలుపుతున్నారు. రెండ్రోజులుగా హార్వెస్టర్లతో కోతలు ప్రారంభించారు. వాతావరణంలో వస్తున్న మార్పును గమనిస్తూ రైతులు ముందుగానే అప్రమత్తమవుతున్నారు. కోసిన ధాన్యాన్ని వెంటనే ఆయాగ్రామాల్లో ఏర్పాటు చేయనున్న ధాన్య కొనుగోలు కేంద్రాలకు తరలిస్తున్నారు. కొనుగోలు కేంద్రాల స్థలాలను చదును చేసి సౌకర్యాలు కల్పించాలని అధికారులను కోరుతున్నారు.

మినీ స్టేడియం.. లభించని మోక్షం

- స్థల సేకరణ చేసినా టెండర్లకు ముందుకురాని కాంట్రాక్టర్లు
- క్రీడాకారులకు నిరాశ



గణేశ్‌పల్లిలో మినీ స్టేడియం కోసం సేకరించిన స్థలం

సారంగాపూర్: మండలంలో మినీ స్టేడియం నిర్మించాలన్న క్రీడాకారులు, విద్యార్థుల కల ఏళ్లుగా నెరవేరడం లేదు. 2016–17 సంవత్సరంలో మండలంలో మినీస్టేడియం ఏర్పాటు చేయాలని భావించారు. సారంగాపూర్ జూనియర్ కళాశాలతోపాటు మండలంలోని ఆయా పాఠశాలల విద్యార్థులు మినీ స్టేడియం నిర్మించాలని కోరగా ప్రభుత్వం పోతారం శివారు గ్రామం గణేశ్‌పల్లి వద్ద మినీస్టేడియం ఏర్పాటుకు అనుకూలమని భావించి భూసేకరణకు ఆదేశించింది.

గణేశ్‌పల్లిలో 6.05 ఎకరాలు

గణేశ్‌పల్లి గ్రామ శివారులో రెవెన్యూ స్థల సేకరణ కోసం సర్వే జరిపి అధికారులు 6.05 ఎకరాల భూమిని సేకరించారు. ఇందుకు సంబంధించిన పత్రాలను ఇంజినీరింగ్ శాఖకు అందించారు.

రూ.2.65 కోట్లు మంజూరు

ప్రభుత్వం మినీస్టేడియం ఏర్పాటుకు రూ.2.65 కోట్లు మంజూరు చేసింది. దీని నిర్మాణం ఇంజినీరింగ్ శాఖకు అప్పగించడంతో 2022 సంవత్సరం మే నెలలో పనులు నిర్వహించేందుకు టెండర్లను ఆహ్వానించింది. మినీస్టేడియంలో వాలీబాల్, బాస్కెట్‌బాల్, అథ్లెటిక్స్, టెన్నిస్, కబడ్డీ, బ్యాడ్మింటన్ (షటిల్)తో పాటు ఇతర ఇండోర్ గేమ్స్ ఆడేందుకు అనుమతులు లభించాయి. దీంతోపాటు స్విమ్మింగ్‌పూల్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వం పేర్కొంది. ఏడాదిదాటినా టెండర్లు వేసేందుకు కాంట్రాక్టర్లు ముందుకురావడం లేదని తెలుస్తోంది. నిధులు సరిపోవని, తక్కువ రేట్లతో పనులు నిర్వహిస్తే నష్టపోతామని, టెండర్ వేసేందుకు ముందుకురాకపోవడంతో టెండర్ ప్రక్రియ పూర్తికాలేదు.

పనులు ప్రారంభం కాలే



మినీస్టేడియం నిర్మిస్తారని అందరూ భావించారు. ఇప్పటికీ పనులు ప్రారంభం కాకపోవడంతో క్రీడాకారులు నిరుత్సాహంగా ఉన్నారు. ఇక్కడ మినీస్టేడియం ఏర్పాటైతే బీర్‌పూర్, సారంగాపూర్ మండలాల ప్రజలకు అందుబాటులో ఉంటుంది.

– మల్యాల శ్రీనివాస్, పోతారం

ఉన్నతాధికారులకు నివేదించాం



మినీ స్టేడియం నిర్మాణానికి టెండర్లు వేసేందుకు కాంట్రాక్టర్లు ముందుకురావడం లేదు. ఎన్నికల ప్రక్రియ కారణంగా దీనిపై ఇప్పుడు ఎలాంటి నిర్ణయం తీసుకోవడం లేదు. ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు నివేదించాం.

– భూపతి, ఏఈ, పీఆర్, సారంగాపూర్



మెట్‌పల్లి రూరల్ : వెల్లుల్ల జెడ్పీహెచ్‌ఎస్‌లో..



జగిత్యాల రూరల్: బతుకమ్మ ఆడుతున్న విద్యార్థినులు



ఇబ్రహీంపట్నం : మోడల్ స్కూల్‌లో బతుకమ్మ ఆడుతున్న విద్యార్థినులు

విద్యాసంస్థల్లో ముందస్తు బతుకమ్మ వేడుకలు

జగిత్యాల, ధర్మపురి, కోరుట్ల నియోజకవర్గంలోని ఆయా ప్రభుత్వ ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల్లో ముందుస్తు బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రంగురంగుల పూలతో బతుకమ్మలను అందంగా పేర్చి విద్యార్థులు, ఉపాధ్యాయులు ఆడిపాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... సంస్కృతీ సంప్రదాయాలకు ప్రతీకగా బతుకమ్మ పండుగ నిలుస్తుందన్నారు. అనంతరం సమీప వాగుల్లో బతుకమ్మలను నిమజ్జనం చేశారు.

– జగిత్యాల/ జగిత్యాల రూరల్/ కోరుట్ల/ ధర్మపురి/ ఇబ్రహీంపట్నం/ మల్లాపూర్/ మెట్‌పల్లి/సారంగపూర్/వెల్గటూర్/ రాయికల్/ మెట్‌పల్లి రూరల్/ మల్యాల :



రాయికల్: ఇటిక్యాల మోడల్ స్కూల్‌లో బతుకమ్మలతో ఉపాధ్యాయులు, విద్యార్థినులు



ధర్మపురి: ఏసీఈ ఉన్నత పాఠశాలలో..



రాయికల్: కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో..



మల్లాపూర్ ప్రాథమిక పాఠశాలలో బతుకమ్మ వేడుకల్లో చిన్నారులు



మల్యాల: లాస్య పాఠశాలలో బతుకమ్మ ఆడుతున్న చిన్నారులు



కోరుట్ల: బతుకమ్మలతో లిటిల్ జీనియస్ స్కూల్ విద్యార్థినులు



జగిత్యాల : జ్యోతి స్కూల్‌లో బతుకమ్మలతో విద్యార్థినులు, టీచర్లు



వెల్గటూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బతుకమ్మ ఆడుతున్న విద్యార్థినులు

నిండుకుండలా చెరువులు



పొరండ్ల ఊరచెరువు

- తీరనున్న సాగునీటి కష్టాలు
- యాసంగి సాగుకు రైతుల సన్నద్ధం

జగిత్యాలరూరల్: రైతులకు సాగునీటి కష్టాలు తీరనున్నాయి. వానాకాలంలో భారీ వర్షాలు కురవడంతో మండలంలోని 79 చెరువులు, కుంటలు పూర్తిస్థాయిలో నిండి జలకళ సంతరించుకున్నాయి. దీంతో చెరువు ఆయకట్టు కింద సుమారు 3,954 ఎకరాల పంట సాగు కానున్నాయి. దీంతో గ్రామాల్లోని చెరువులు, కుంటలు పూర్తిస్థాయిలో నిండటంతో ప్రస్తుతం వచ్చే యాసంగి పంటల సాగుకు రైతులు సన్నద్ధమవుతున్నారు. ఇటీవల భారీగా కురిసిన వర్షాలతో దిగువనున్న రైతులు భారీగా నీరు రావడంతో పంటలు సాగు చేయలేదు. దీంతో చెరువుల్లో పూర్తిస్థాయి నీటిమట్టం ఉండటంతో ప్రస్తుతం చెరువులు, కుంటల్లో నీరు పుష్కలంగా ఉండటంతో రైతులు వివిధ పంటలు సాగు చేసేందుకు సమాయత్తమవుతున్నారు.

అన్ని గ్రామాల్లో సాగు

ప్రస్తుతం రూరల్ మండలంలోని 29 గ్రామాల్లో చెరువులు, కుంటలతో పాటు, ఎస్సారెస్పీ ప్రాజెక్ట్ కూడా పూర్తిస్థాయిలో నిండటంతో యాసంగి పంటకు పుష్కలంగా నీరు అందనుంది. దీంతో మండలంలో పెద్ద ఎత్తున పంటలు సాగు కానున్నాయి. రైతులు ఇప్పటికే మొక్కజొన్న పంట కోసి దుక్కులను పంట సాగుకోసం సిద్ధం చేస్తున్నారు.

ప్రమాదకరంగా రేగుంట వంతెన

మల్లాపూర్ : మండలంలోని రేగుంట గ్రామ శివారులో నిర్మల్–జగిత్యాల 61వ జాతీయ రహదారిపై వంతెన ప్రమాదకరంగా మారింది. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పెద్దవాగు ఉప్పొంగి బ్రిడ్జిపై నుంచి వరద ఉధృతికి వంతెనకు రెండు వైపులా సేఫ్టీ సైడ్‌వాల్స్ కూలిపోయాయి. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం చోటు చేసుకుంటుందోనని వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. ఈ వంతెనపై నుంచి ఆర్టీసీ బస్సులతో పాటు వందలాది వాహనాలు నిత్యం రాకపోకలు సాగుతాయి. వంతెన సైడ్ వాల్స్ కూలడంతో సంబంధిత అధికారులు స్పందించి మరమ్మతు చేపట్టాలని మండల ప్రజలు కోరుతున్నారు.



సైడ్‌వాల్స్ లేకపోవడంతో ప్రమాదకరంగా మారిన వంతెన

మక్కలు కొనుగోలు చేయాలని ఆందోళన



ఆందోళన చేస్తున్న రైతులు

మెట్‌పల్లి: ప్రభుత్వం మొక్కజొన్నలు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ పట్టణంలోని ఆర్డీవో కార్యాలయం ఎదుట గురువారం ఇబ్రహీంపట్నంకు చెందిన మున్నూరు కాపు యూత్ సంఘం ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ బహిరంగ మార్కెట్‌లో వారంరోజుల క్రితం వ్యాపారులు క్వింటాల్ మొక్కజొన్నకు రూ.2200 ధర చెల్లించగా, ప్రస్తుతం రూ.1800మాత్రమే ఇస్తున్నారన్నారు. రానున్న రోజుల్లో ధర మరింత తగ్గే అవకాశముందని, దీంతో రైతులు తీవ్రంగా నష్టపోయే అవకాశముందన్నారు. ప్రభుత్వం వెంటనే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని, లేకుంటే పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తామన్నారు. ప్రమోద్, మోహన్, మహేందర్, సంజీవ్, సురేశ్, రమేశ్, లింగారెడ్డి, శశి, తదితరులున్నారు.

ప్రభుత్వ కళాశాలలో ఫ్రెషర్స్ డే



నృత్యం చేస్తున్న విద్యార్థినులు

ఇబ్రహీంపట్నం : మండలకేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం ఫ్రెషర్స్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు చేసిన నృత్యాలు అలరించాయి. కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో బైపీసీ విభాగంలో జ్యోతిర్మయి 970 మార్కులు సాధించి జిల్లాస్థాయి టాపర్‌గా నిలవగా ఇంటర్ మొదటి సంవత్సరం ఫలితాల్లో పి.అనన్య ఎంపీసీ విభాగంలో 464 మార్కులు సాధించి 2వ స్థానంలో నిలిచింది. ఇంటర్ ద్వితీయ సంవత్సరం సీఈసీలో రమ్య 944, హెచ్‌ఈసీలో నవనీత 808 మార్కులు సాధించి టాపర్లుగా నిలిచారు. వీరిని తెలుగు అధ్యాపకుడు సంతోష్ తండ్రి సంజీవులు జ్ఞాపకర్థం వెండి పతకాలు, ప్రశంసాపత్రం అందించి ఘనంగా సన్మానించారు. ప్రిన్సిపాల్ సంజీవ్, పదవి విరమణ పొందిన కరీంనగర్ జిల్లా ఇంటర్ విద్యాధికారి రాంచంద్రం, రిటైర్డ్ ప్రిన్సిపాల్ లక్ష్మీనారాయణ, మెట్‌పల్లి, మల్లాపూర్ కళాశాలల ప్రిన్సిపాల్‌లు కలిగ్, వెంకటేశ్వర్లు, హైస్కూల్ హెడ్‌మాస్టర్ రాజన్న, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలను అరికట్టాలి



ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థినులు

కోరుట్ల: పట్టణంలోని జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో గురువారం అంతర్జాతీయ బాలికల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. మెట్‌పల్లి సీడీపీవో తిరుమలా దేవి మాట్లాడుతూ బాలికలపై జరిగే వేధింపులు, బాల్య వివాహాలను అరికట్టాలన్నారు. అనంతరం విద్యార్థులకు డ్రాయింగ్, వ్యాసరచన, పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు భూపతి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు హేమలత, ప్రేమలత, షైనీ మిథ్యు, అంగన్‌వాడీ టీచర్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రైతులను మోసం చేస్తున్న బీఆర్‌ఎస్

మెట్‌పల్లి: ముత్యంపేట చక్కెర ఫ్యాక్టరీ విషయంలో బీఆర్‌ఎస్ రైతులను మోసం చేసిందని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అల్లూరి మహేందర్‌రెడ్డి గురువారం పేర్కొన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో నడిచిన ఫ్యాక్టరీ తెలంగాణ ఏర్పాటు తర్వాత బీఆర్‌ఎస్ ప్రభుత్వ వైఖరి వల్ల మూతబడిందన్నారు. దీంతో ఈ ప్రాంతంలో చెరుకు సాగు చేస్తున్న రైతులు ఏటా క్రషింగ్ కోసం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. రైతులను మోసం చేసిన ఆపార్టీకి వచ్చే ఎన్నికల్లో గుణపాఠం తప్పదన్నారు.

దిల్‌రాజ్ కుటుంబానికి ‘జువ్వాడి’ పరామర్శ



నివాళి అర్పిస్తున్న కృష్ణారావు

కోరుట్ల: సినీ నిర్మాత దిల్‌రాజ్ కుటుంబాన్ని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు జువ్వాడి కృష్ణారావు గురువారం పరామర్శించారు. దిల్‌రాజ్ తండ్రి శ్యామ్ సుందర్ రెడ్డి అనారోగ్యంతో మృతిచెందగా హైదరాబాద్‌లోని దిల్‌రాజ్ నివాసంలో శ్యామ్‌సుందర్ రెడ్డి చిత్ర పటానికి నివాళి అర్పించారు. దిల్‌రాజ్ సోదరులు నరసింహారెడ్డి, విజయసింహారెడ్డి, వెంకటరమణారెడ్డి, వారి కుటుంబ సభ్యులను పరామర్శించి కృష్ణారావు సానుభూతి తెలిపారు.

పీడీకి సన్మానం



పీడీ కృష్ణప్రసాద్‌ను సన్మానిస్తున్న ఎంపీపీ

ఇబ్రహీంపట్నం : మండలంలోని వర్షకొండ జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఎనిమిదేళ్లుగా పీడీగా పనిచేసిన కృష్ణప్రసాద్ బదిలీపై జగిత్యాల మండలం మల్లాపూర్‌కు బదిలీ కాగా మండల పరిషత్ కార్యాలయంలో ఆయనను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీపీ జాజాల భీమేశ్వరి, నాయకులు జగన్‌రావు పాల్గొన్నారు.

‘కృతజ్ఞత సభకు తరలిరావాలి’

మెట్‌పల్లి: పసుపుబోర్డు ఏర్పాటుకు కృషిచేసిన ఎంపీ అర్వింద్‌కు కృతజ్ఞతలు తెలిపేందుకు పట్టణంలో శుక్రవారం నిర్వహిస్తున్న సభకు రైతులు, బీజేపీ శ్రేణులు పెద్దసంఖ్యలో తరలిరావాలని పార్టీ పట్టణాధ్యక్షుడు బొడ్ల రమేశ్ కోరారు. స్థానిక వెంకటరెడ్డి గార్డెన్‌లో ఉదయం 11గంటలకు జరిగే ఈ సభకు రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డితో పాటు పలువురు ముఖ్య నేతలు హాజరుకానున్నట్లు ఆయన పేర్కొన్నారు.

యువకుల శ్రమదానం



రోడ్డుపై గుంతను పూడుస్తున్న యువకులు

వెల్గటూర్: రోడ్డు ప్రమాదాలబారిన పడకుండా గుంతలు పూడ్చి పలువురికి ఆదర్శంగా నిలిచారు మండలకేంద్రానికి చెందిన బాల్‌గణేశ్ యూత్ సభ్యులు. ఏడో నెంబర్ రాష్ట్ర రహదారిపై గుంతలు పడగా గతంలో ప్రమాదాలు చోటు చేసుకున్నాయి. అధికారులకు విన్నవించినా పట్టించుకోకపోవడంతో యూత్ సభ్యులు రోడ్లపై గుంతలు పూడ్చారు. యూత్ సభ్యులను గ్రామస్తులు అభినందించారు. గుమ్ముల అజిత్, అవినాష్, అరవింద్, మారుతి, మధు, నవీన్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.